క్లుప్తంగా

విద్యార్థుల రికార్డులకు రక్షణ కల్పించాలి



సీబీఎం హైస్కూల్ వద్ద బాప్టిస్టు ఫీల్డ్ కౌన్సిల్ ప్రతినిధులు

సామర్లకోట: స్థానిక సీబీఎం హైస్కూల్‌లోని విద్యార్థుల రికార్డులకు రక్షణ కల్పించాలని ఆ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాప్టిస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ అధ్యక్షుడు ఇజ్రాయిల్ మాట్లాడుతూ, 150 ఏళ్ల చరిత్ర కలిగిన పాఠశాల మూతపడిందన్నారు. ఈ పాఠశాలలో ఇటీవల దొంగలు చొరబడి పాఠశాల బీరువాలోని రికార్డులను ధ్వంసం చేశారని పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు ఆరోపించారు. దీనిపై పాఠశాల కస్టోడియన్‌గా ఉన్న అబ్బులు సామర్లకోట పీఎస్‌లో రిపోర్టు చేశారన్నారు. ఎంతో చరిత్ర కలిగిన సీబీఎం పాఠశాలను తిరిగి ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాప్టిస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ కార్యదర్శి చంద్రపాల్, అధ్యక్షుడు ఈలీ షారోన్, సువార్తరాజు, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

ఉండూరు సొసైటీ అధ్యక్షుడిగా బత్సల



వెంకటరమణమూర్తి

సామర్లకోట: మండలంలోని ఉండూరు ప్రాథమిక సహకార సంఘ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన బత్సల వెంకటరమణమూర్తి (జెమ్మి)ని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు. సామర్లకోట ప్రాథమిక సహకార సంఘ అధ్యక్షుడిగా పైణ్ని శ్రీనివాసరావు, నవర సొసైటీ అధ్యక్షుడిగా తోట వెంకటేశ్వరరావు, జి.మేడపాడు సొసైటీ అధ్యక్షుడిగా పాలకుర్తి వీర భవన్నారాయణ ఎంపికయ్యారు.

నేడు సీపీఐ జిల్లా మహాసభ



పెదిరెడ్ల సత్యనారాయణ

సామర్లకోట: సీపీఐ జిల్లా మహాసభ స్థానిక గాంధీచౌక్‌లో బుధవారం జరుగుతుందని పార్టీ పట్టణ కార్యదర్శి పెదిరెడ్ల సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఉదయం నీలమ్మ చెరువుగట్టు, సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద బహిరంగ సభ జరుగుతుందన్నారు. అక్కడి నుంచి ర్యాలీగా మతం సెంటర్ నుంచి గాంధీచౌక్ మీదుగా రైతు భవనం చేరుకుంటామన్నారు. స్మార్ట్ మీటర్లు, విశాఖ ఉక్కు, సూపర్ సిక్స్ వంటి అంశాలపై రాష్ట్ర, జిల్లా నాయకుల ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్మానాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

పారదర్శకంగా జాబితా

కాకినాడ సిటీ: నిర్ణీత ప్రమాణాల మేరకు ఇళ్ల స్థలాలకు అర్హత కలిగిన లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లిబాబు అధికారులను ఆదేశించారు. ఎంపిక విధానంలో క్షేత్ర స్థాయిలో పూర్తి స్థాయి విచారణ చేసి, అర్హులను గుర్తించాలన్నారు. అదే విధంగా ఆర్‌ఓఆర్ కేసులు, నీటి తీరువా వసూళ్లు, రేషన్ కార్డు దరఖాస్తులు, పీజీఆర్‌ఎస్ దరఖాస్తులపై, అభ్యంతరం లేని భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి రెవెన్యూ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని నిర్దేశించారు.

కంటిపాపలా దూడల సంరక్షణ

- పుట్టిన దూడకు జున్నుపాలు పట్టించాలి
- పశువుల్లో పరిశుభ్రత అవసరం
- సూచనలు పాటించాలంటున్న పశు వైద్య నిపుణులు



ఆర్‌బీ పట్నంలో దూడకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

పెద్దాపురం: దూడలకు బలవర్ధక ఆహారం ఇస్తే బలీయమైన పశువులుగా ఎదుగుతాయి. ఆవులు, గేదెల పాడుగులో పాల సేకరణను చాలా మంది అధిక స్థాయిలో చేస్తుంటారు. దీనివల్ల దూడల్లో వ్యాధి నిరోధక శక్తి లోపించి నీరసిస్తుంటాయి. సక్రమంగా పోషించకపోతే పది శాతం వరకు దూడల్లో మరణాలు చోటుచేసుకుంటాయి. పుట్టిన ప్రతి దూడను ఆరు నెలలలోపు పశు వైద్యాధికారిని సంప్రదించి, చెవి పోగు వేయించి, రిజిస్టర్ చేయించాలి. ఇలాఉండగా, 20వ పశుగణన ప్రకారం పెద్దాపురం నియోజకవర్గంలో 7,533 ఆవులు, 40,751 గేదెలు, 13,503 గొర్రెలు, 6,450 మేకలు, 1,32,750 కోళ్లు ఉన్నాయి. దూడలు బలంగా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో పశు సంవర్ధక శాఖ అధికారులు వివరించారు.

జాగ్రత్తలు పాటించాలి

పుట్టిన దూడలకు తొలి వారం వరకు తల్లి పశువు నుంచి రెండు పూటలా జున్ను పాలు పట్టించాలి. ఈ జున్ను పాలు తాగించడంతో దూడల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఈ జున్ను పాలు కూడా పుట్టిన మొదటి 8–12 గంటల్లోపు పట్టిస్తే, అందులో ఉండే రోగ నిరోధక శక్తి దూడలకు కూడా చేరుతుంది. తద్వారా వ్యాధులు అంత త్వరగా ఆశించవు. దూడలూ ఆరోగ్యంగా ఉంటాయి. కొందరు తల్లి పశువు నుంచి పాలు మొత్తం తీయడంతో, దూడలకు పాలు చాలక నీరసించిపోతాయి. పశు పెంపకందారులు ఈ విషయాన్ని గుర్తించి, దూడలకు కావాల్సినన్ని పాలు వదిలేయాలి. దూడలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఒక్కోసారి అవి మరణించవచ్చు. సాధారణంగా మొదటి మూడు నెలల్లో దూడ బరువులో (30 కేజీలు ఉంటుంది) పది శాతం పాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఉదయం 1.5 లీటర్లు, సాయంత్రం 1.5 లీటర్ల పాలు ఇవ్వాలి. మూడు నెలల తర్వాత దూడ పచ్చగడ్డి వైపు మళ్లుతుంది, అప్పటి నుంచి పాలివ్వడం క్రమంగా తగ్గించవచ్చు.

టీకాలు తప్పనిసరి



దూడ పుట్టిన ఒకటో రోజు ధనుర్వాతం ఇంజక్షన్ ఇప్పించాలి. నాలుగో రోజు ఫ్రిపలిన్ ఇంజక్షన్, విటమిన్–ఏ ఇవ్వాలి. నాలుగో మాసంలో సంకర జాతి దూడలకు థైలేరియా వ్యాధి నిరోధక టీకా ఇప్పించాలి. ఆరో మాసంలో గొంతు వాపు, జబ్బువాపు టీకాలు వేయించాలి. ప్రతి పెయ్యి దూడకు కూడా 4–8 నెలల్లోపు బ్రూసెల్లోసిస్ టీకాను వేయించాలి. ప్రతి ఆరు నెలలకు గాళ్ల వ్యాధి నిరోధక టీకాలు కూడా వేయాలి. ఆయా టీకాల కోసం పాడి రైతులు సమీపంలోని పశువైద్య సిబ్బందిని సంప్రదించాలి.

– డాక్టర్ తుమ్మల రామస్వామి, అసిస్టెంట్ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ, పెద్దాపురం

దూడలకు సోకే వ్యాధులు

అతిసార వ్యాధి

అపరిశుభ్ర పాత్రలు, షెడ్లలో తడి, బురద ఉండడం, ఆహారాన్ని పరిమితికి మించి పెట్టడంతో అతిసార వ్యాధి సోకుతుంది. దుర్వాసనతో కూడిన నీళ్ల విరేచనాలతో దూడలు నీరసిస్తాయి. బరువు కోల్పోతాయి. 1–3 వారాల దూడలు ఈ వ్యాధికి లోనవుతాయి. వైద్యుని సలహాతో సల్ఫా, యాంటీ బయాటిక్స్, ఐవీ ఫ్లూయిడ్స్ ఇస్తూ, డీ హైడ్రేషన్ కాకుండా చూసుకోవాలి. దూడ పుట్టిన అరగంటలోపు జున్ను పాలు పట్టించాలి. దూడలకు పరిమితికి మించి పాలను పట్టించరాదు. షెడ్లను పరిశుభ్రంగా, గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా ఉంచాలి.

తెల్లపారుడు

కొన్ని రకాల బ్యాక్టీరియాలతో లేగ దూడలకు ఈ వ్యాధి సోకుతుంది. దూడలు విపరీతంగా తెల్లగా పారుతాయి. పారుడుకు ముందు జ్వరం వస్తుంది. ఆకలి మందగిస్తుంది. చర్మం పొడిగా, గరుకుగా ఉంటుంది. కాళ్లలో సత్తువ లేక నీరసించిపోతాయి.

చికిత్సకు పశు వైద్యుని సలహాతో సల్ఫా యాంటీ బయాటిక్స్, ఐవీ ఫ్లూయిడ్స్ వాడాలి.

రక్త విరేచనాలు

ఎక్కువ పాలు తాగించడంతో సూక్ష్మజీవులు కోక్సిడియా ఆశించి ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి సోకిన దూడల మలం రక్తంతో కూడి ఉంటుంది. పశుశాలలను శుభ్రంగా ఉంచడంతో పాటు, సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. చికిత్సకు సల్ఫా, ఏంప్రోలియం యాంటీ బయాటిక్స్‌ను వాడుతూ, డీహైడ్రేషన్ రాకుండా ఐవీ ఫ్లూయిడ్స్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది.

నిమోనియా (ఊపిరితిత్తుల వ్యాధి)

బ్యాక్టీరియా, వైరస్‌ల ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. షెడ్లలో తేమ ఎక్కువగా ఉండడం, చలిగాలుల నుంచి సరైన రక్షణ లేకపోవడంతో ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన దూడలకు జ్వరం వచ్చి, శ్వాస ఇబ్బందికరంగా ఉంటుంది. ఆకలి మందగిస్తుంది. కళ్లు, ముక్కు నుంచి నీరు, కఫం వస్తుంది. దూడలు చనిపోయే అవకాశం కూడా ఉంది. చికిత్సకు పశుశాలలను శుభ్రంగా ఉంచాలి. చలిగాలుల నుంచి దూడలను రక్షించాలి. సల్ఫాతో పాటు లింకోమైసిన్ లాంటి యాంటీ బయాటిక్స్‌ను, ఐవీ ఫ్లూయిడ్స్‌ను వైద్యుని సలహాతో వాడాలి.

కీళ్ల జబ్బు–బొడ్డు వాపు

దూడ బొడ్డు సంచికి సూక్ష్మ జీవులు ఆశించడంతో ఈ వ్యాధి సోకుతుంది. బొడ్డు నరం సరిగా వేరు చేయకపోవడం, కత్తిరించడంలో అజాగ్రత్తలతో ఈ వ్యాధి వస్తుంది. దుర్వాసనతో కూడిన చీము కారుతుంది. సూక్ష్మజీవులు కీళ్లకు కూడా వ్యాపించి కీళ్ల వాతం వస్తుంది. చికిత్సకు పుట్టిన వెంటనే దూడ బొడ్డు నరాన్ని టింక్చర్ అయోడిన్ ముంచిన దూదితో అద్దాలి. బొడ్డు ఊడే వరకు పరిశుభ్రమైన స్థలంలో దూడను ఉంచాలి.

యువతతోనే భవిష్యత్తు నిర్మాణం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అహ్మద్ కరీమ్

సామర్లకోట: నైపుణ్యం కలిగిన యువతే భవిష్యత్తు నిర్మాణానికి కీలకమని జిల్లా వృత్తి విద్యా కోర్సు డైరెక్టర్ సయ్యద్ అహ్మద్ కరీమ్ అన్నారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో ఒకేషనల్ విద్యా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుత కాలంలో పాఠశాల విద్యతో పాటు, ప్రయోగాత్మక నైపుణ్యం కూడా అవసరమన్నారు. పాఠశాల స్థాయి నుంచి యువతను వృత్తి విద్యా కోర్సుల వైపు దృష్టి సారించే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, రోల్‌ప్లే వంటి పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం కె.గంగాభవాని, ఒకేషనల్ ఫ్యాకల్టీ యాదిద్య, జ్యోతి, ఉపాధ్యాయులు సైదున్నీసా బేగం, పద్మావతి, పి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం



స్మార్ట్ మీటర్లపై ప్రచారం చేస్తున్న నాయకులు

పెద్దాపురం: స్మార్ట్ మీటర్లు వేసుకుంటే దోపిడీ పారిశ్రామికవేత్తలను ఇంటికి తీసుకువచ్చినట్టేనని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నీలపాల సూరిబాబు అన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ అండతో ప్రతి ఇల్లు దోచుకునే విధంగా దోపిడీ పారిశ్రామికవేత్తలు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. అనుమతి లేకుండా బెదిరించి మరీ స్మార్ట్ మీటర్లు వేస్తున్నారని, దీనిని అడ్డుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ అండతో టీడీపీ, జనసేన పార్టీలు ప్రజలపై కరెంట్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల రూపంలో దాడి చేస్తున్నాయని విమర్శించారు. దీనిని ప్రతిఘటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దారపురెడ్డి కృష్ణ, నెక్కల నరసింహమూర్తి, గరగపాటి పెంటయ్య, కూనిరెడ్డి అప్పన్న, చల్లా విశ్వనాథం, డి.క్రాంతికుమార్ ఉన్నారు.

ఎరువుల గోదాముల్లో తనిఖీలు



ఎరువుల గోదామును తనిఖీ చేస్తున్న అధికారులు

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న తనిఖీల్లో భాగంగా స్థానిక సుగర్ ఫ్యాక్టరీ గోదాముల్లోని ఎరువులను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ శాఖ బృందం తనిఖీ చేసింది. జిల్లావ్యాప్తంగా ఎరువులను సరఫరా చేయడానికి సామర్లకోట సుగర్ ఫ్యాక్టరీలోని గోదాముల్లో నిల్వ చేశారు. రికార్డులను పరిశీలించి, భౌతికంగా నిల్వ ఉన్న ఎరువు బస్తాలను లెక్కించారు. వాటిలో ఎలాంటి తేడాలు లేనట్టు గుర్తించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారి పి.శివరామకృష్ణ (ఏలూరు), వ్యవసాయ శాఖ ఏడీ మున్వర్ అలీ సాంచి, మండల వ్యవసాయాధికారి వి.మురళీధర్, ఏఈఓ జి.రూప పాల్గొన్నారు.

మామిడి చెట్ల పెంపకంపై సూచనలు



జీడిమామిడి చెట్టును పరిశీలిస్తున్న శైలజ

పెద్దాపురం: మెట్ట రైతాంగం మామిడి, జీడిమామిడి పెంపకంలోని సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఉద్యాన శాఖాధికారి శైలజ అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని ఆర్‌బీపట్నం, సీబీ దేవం, వాలుతిమ్మాపురం తదితర గ్రామాల్లో మామిడి, జీడిమామిడి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. మొక్క కింద భాగం నుంచి 50 సె.మీ వరకు కొమ్మలు రానీయకూడదన్నారు. ప్రధాన కాండంపై రెండు లేదా మూడు బలమైన కొమ్మలను పెరగనిచ్చి, మిగిలిన కొమ్మలను కత్తిరించాలన్నారు. పక్క కొమ్మలు 60–80 సె.మీ వచ్చే వరకు కత్తిరించాలన్నారు. ఈ విధంగా నిర్ధారించి, ఆకారం వచ్చేంతవరకు చేయాలని సూచించారు. పెద్దచెట్లలో ప్రతి ఏడాది కాయ కోత తర్వాత (జూన్, జూలై) మాసాల్లో అడ్డదిడ్డంగా పెరిగే కొమ్మలు, ఎండిపోయిన కొమ్మలు, రెమ్మలను తీసివేయడం వల్ల సూర్యరశ్మి చెట్టంతా సోకి కాపునిస్తుందన్నారు. కాయ వదిలేసిన కొమ్మలను కత్తిరించి, ప్రతి ఒక్క రెమ్మ చివరి నుంచి 3–5 రెమ్మలు వస్తే రెండింటినీ ఉంచి మిగిలిన వాటిని తీసేయాలన్నారు. మామిడి తోటల పునరుద్ధరణపై రైతులు దృష్టి సారించాలని సూచించారు.

అద్దెలు భారంగా మారాయి

మున్సిపల్ మంత్రి నారాయణ ఎదుట అద్దెదారుల గగ్గోలు



గడియారం స్తంభాన్ని ప్రారంభించిన మంత్రి

సామర్లకోట: మున్సిపల్ షాపుల అద్దెలు మూడేళ్లకు ఓసారి పెంచడం వల్ల భారంగా మారుతున్నాయని స్థానిక స్టేషన్ సెంటర్‌లోని అద్దెదారులు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి స్థానిక స్టేషన్ సెంటర్‌లో రూ.36 లక్షలతో నిర్మించిన గడియార స్తంభం, ఐ లవ్ సామర్లకోట ఐకాన్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా అద్దెదారులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. సుమారు 45 ఏళ్ల నుంచి మున్సిపల్ షాపుల్లో అద్దెకు ఉంటున్నామని చెప్పారు. ప్రారంభంలో రూ.54 అద్దె ఉండగా ప్రస్తుతం రూ.17వేలకు పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కారణంగా అద్దెలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అద్దెలు పెరగకుండా ప్రస్తుతం ఉన్న అద్దెలతో స్లాబ్ విధించాలని కోరారు. షాపులు శిథిలస్థితికి చేరడంతో సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించుకొంటున్నామని చెప్పారు. తమ కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారిందన్నారు. తమ సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ షాపుల అద్దెదారులు ఆయనను కోరారు.

స్వచ్ఛమైన తాగునీరిస్తాం

ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని, దీనిలో భాగంగా పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలకు రూ.38 కోట్లు చొప్పున మంజూరు చేశామని మంత్రి అన్నారు. పూర్తయిన టిడ్కో ఇళ్లను డిసెంబర్ నాటికి ప్రతి ఒక్కరికీ అందజేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు అమలు జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో తాగునీటి పైపులైన్ల మార్పు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య, ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్లు గోలి వెంకట అప్పారావు చౌదరి, యార్లగడ్డ చిన్ని, కౌన్సెలర్లు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు

కరప: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అప్రమత్తంగా ఉండాలని, పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణరావు అన్నారు. మండల పర్యటనలో భాగంగా మంగళవారం అరట్లకట్ట గ్రామంలో పర్యటించి, పారిశుధ్య పనులను తనిఖీ చేసి, పంచాయతీ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులను కలిసి, తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లో తడి చెత్త నుంచి కంపోస్టు ఎరువును ఎలా తయారుచేస్తారో వివరించారు. తక్కువ ధరకు లభించే కంపోస్ట్ ఎరువును గృహాల్లో పూల మొక్కలు, కాయగూరల పెంపకానికి వినియోగించవచ్చన్నారు. రైతులు పొలాల్లో ఎరువుగా వాడుకోవచ్చన్నారు. దీనివల్ల పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. దోమల నివారణకు డ్రెయిన్లలో డిబేట్ మందును పిచికారీ చేయించాలని పంచాయతీ సిబ్బందికి చెప్పారు. గ్రామంలో సరఫరా చేస్తున్న తాగునీటిని సీఈఓ లక్ష్మణరావు పరీక్షించారు.

మధ్యవర్తిత్వంతో వేగంగా కేసుల పరిష్కారం



పిఠాపురంలో ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు

పిఠాపురం: రాజీ అనేది రాచమార్గమని, మధ్యవర్తిత్వం ద్వారానే కేసులు త్వరితగతిన పరిష్కారం అవుతాయని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీహరి అన్నారు. మధ్యవర్తిత్వం వారోత్సవాల్లో భాగంగా మంగళవారం న్యాయాధికారులు, న్యాయవాదులు స్థానిక కోర్టు ఆవరణ నుంచి చేపట్టిన ర్యాలీ ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా చర్చి సెంటర్‌కు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి కక్షిదారుడు తమకు నష్టం లేని, గౌరవానికి భంగం లేని రీతిలో మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. దీనివల్ల కేసులు త్వరితగతిన పరిష్కారం అవుతాయన్నారు. కక్షిదారుల మధ్య విభేదాలు తొలగించి వారి మధ్య సయోధ్య కుదర్చడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. జూలై ఒకటి నుంచి సెప్టెంబర్ 30 వరకూ మధ్యవర్తిత్వ ప్రచారం జరుగుతుందన్నారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీని సంప్రదించడం ద్వారా మధ్యవర్తిత్వం కోరవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సబ్ జడ్జి బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విజయ రామేశ్వరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు రాజారావు, ఏపీపీ బత్తిన లక్ష్మణదొర, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఓక్ ట్రీ వేడుకలకు సన్నద్ధం

- జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి
- మూడు రోజుల పాటు నిర్వహణ
- 2008లో దివంగత సీఎం వైఎస్సార్ కృషితో కాకినాడలో స్థాపన



జేఎన్‌టీయూకే కళాశాల

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాల 1946లో ఏర్పడింది. అప్పట్లో ఇది ఉమ్మడి మద్రాస్‌లో ఉండేది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డాక 1972లో జేఎన్‌టీయూ హైదరాబాద్ యూనివర్సిటీ స్థాపించగా, కాకినాడ, అనంతపురం, హైదరాబాద్ ఇంజినీరింగ్ కళాశాలలు హైదరాబాద్ యూనివర్సిటీ ఆధీనంలో ఉండేవి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2008 ఆగస్టులో జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ ఏర్పాటు చేశారు. దాని ఆధీనంలోకి జేఎన్‌టీయూ కాకినాడ కళాశాలను తీసుకొచ్చారు. పూర్వ కళాశాల ఏర్పడి 2026 జూలై నాటికి 80 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఓ ఏడాది ముందుగా పూర్వ విద్యార్థులతో పాటు, కళాశాల యాజమాన్యం ఓక్ ట్రీ జూబ్లీ వేడుకలను ఏడాది పాటు నిర్వహించేందుకు సిద్ధమైంది. 2020 జూలై 16వ తేదీన ప్లాటినం వేడుకలు నిర్వహించగా, అప్పటి ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, మెట్రో రైల్ మాజీ ఎండీ ఈ.శ్రీధర్ దీనిని వర్చువల్ విధానంలో ప్రారంభించగా, అప్పటి వీసీ రామలింగరాజు, ప్రిన్సిపాల్ బాలకృష్ణ కళాశాల ఆవరణలో శ్రీకారం చుట్టారు. రెండేళ్ల పాటు విద్యార్థులకు అకడమిక్ వర్క్‌షాపులు, ప్రముఖులతో సెమినార్లు నిర్వహించారు.

ప్రముఖులెందరో..

ఇదే కళాశాలలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించి అనేక మంది ప్రముఖ స్థానాల్లో ఉన్నారు. బెల్ సీఎండీ శాస్త్రి, శాంత బయోటెక్ అధినేత, పద్మ విభూషణ్ వరప్రసాద్‌రెడ్డి, మెట్రో సీఎండీ, పద్మ విభూషణ్ శ్రీధర్, ఉన్నత విద్య ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, ఐఏఎస్‌లు కృష్ణబాబు, రవిచంద్ర, కృష్ణతేజతో పాటు, జిల్లాకు చెందిన దివంగత ఎస్పీ ప్రసాద్ (మాజీ ఐఏఎస్), ప్రముఖ పారిశ్రామికవేత్తలు, కేంద్ర రంగ సంస్థల్లో ప్రముఖ స్థానాల్లో ఉన్నవారు, శాసన సభ సభ్యులు ఉన్నారు. జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ వీసీగా వ్యవహరించిన డాక్టర్ రామలింగరాజు, ఏపీపీఎస్సీ మాజీ ఛైర్మన్ ఉదయభాస్కర్, అనంతపురం మాజీ వీసీ శ్రీనివాసకుమార్ ఇదే కళాశాలలో అభ్యసించారు.

మూడు రోజుల పాటు..

బుధవారం సాయంత్రం ప్రారంభమయ్యే కార్యక్రమాలు గురు, శుక్రవారాలు కొనసాగుతాయి. ముఖ్య, ప్రత్యేక అతిథులుగా సౌత్ ఏసియన్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కేకే అగర్వాల్, యూజీసీ మాజీ ఛైర్మన్ ప్రొ.వేదప్రకాష్, ఐఐటీ మద్రాస్ నుంచి సీఎస్ఈ ప్రొ. డి.జానకిరామ్, బెంగళూరు ఎక్స్ఈఎంఈ పరిశోధన విభాగం డీన్ ఎస్ఎంకే భట్టా, ఇన్వెకాస్ ఛైర్మన్ దశరథ్ గుడె హాజరవుతారు.

పూర్తయిన ఏర్పాట్లు



ఇంజినీరింగ్ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించాం. అదే తరహాలో ఓక్ ట్రీ వేడుకల నిర్వహణకు కమిటీలు నియమించి, మూడు రోజుల పాటు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశాం. ఇదే కళాశాలలో అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరినవారూ ఉన్నారు. వారి సహకారంతో కళాశాలను మరింత అభివృద్ధి చేసి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే అందరికీ ఆహ్వానాలు పంపాం. దేశ విదేశాల్లో ఉన్నవారు సైతం స్పందించి, కళాశాల అభివృద్ధికి కృషి చేసి వేడుకలు గుర్తుండిపోయేలా అభివృద్ధికి చేయూత ఇస్తామంటున్నారు. నా హయాంలో ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉంది.

– ప్రొఫెసర్ ఎస్.మోహనరావు, ప్రిన్సిపాల్, జేఎన్‌టీయూకే కళాశాల

అభివృద్ధికి తోడ్పడాలి



మా స్వస్థలం కాకినాడ. ఇదే కళాశాలలో 1985–87లో ఎంటెక్ అభ్యసించి, ఇక్కడే ఈసీఈ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. 2017–20లో జేఎన్‌టీయూ అనంతపురం వైస్ చాన్స్‌లర్‌గా బాధ్యతలు నిర్వర్తించాను. ఇంత చరిత్ర కలిగిన కళాశాల నుంచి ఎందరో విద్యార్థులు విదేశాలతో పాటు, కేంద్ర, రాష్ట్ర సివిల్ సర్వీసుల్లో ఉన్నారు. అటువంటి వారందరూ కళాశాల అభివృద్ధికి తోడ్పడాలి. ముఖ్యంగా ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీని అనుసంధానం చేసే విధంగా కొత్త కోర్సు ప్రవేశపెట్టడానికి, దానికి కావాల్సిన సదుపాయాల కల్పనకు సహకారం అందించాలి. ఈ విద్యాలయం 80 ఏళ్లు కొనసాగడమే కాకుండా, వేలాది కుటుంబాలు స్థిరపడేలా తోడ్పడింది.

– ఎస్.శ్రీనివాసకుమార్, పూర్వ వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం

భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి



విభిన్న ప్రతిభావంతులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పెద్దాపురం: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వీఆర్‌కే చౌదరి అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్‌లో వారికి అందిస్తున్న సేవలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ చౌదరి మాట్లాడుతూ, ప్రతిభావంతులకు విద్యాశాఖ పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ సెంటర్ల ద్వారా అర్బన్, రూరల్ పరిధిలో విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు మెరుగైన వైద్య, విద్య సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థికి అందిస్తున్న ఫిజియోథెరపీ ప్రక్రియను, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, హెచ్ఎం రవళి, ఫిజియోథెరపిస్ట్ అపర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.